సాక్షి
విశాఖపట్నం
ఆదివారం । 6 । జూలై । 2025



మాట్లాడుతున్న శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ. చిత్రంలో కన్నబాబు, కేకే రాజు, ఎంపీలు గొల్ల బాబూరావు, తనూజారాణి, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, రవిబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, పార్లమెంట్ పరిశీలకుడు కదిరి బాబూరావు, సమన్వయకర్తలు మజ్జి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్‌కుమార్, దేవన్‌రెడ్డి, మళ్ల విజయప్రసాద్, మొల్లి అప్పారావు, మాజీ మేయర్ హరివెంకటకుమారి, మాజీ మంత్రి బాలరాజు, పార్టీ నేతలు

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ కమిటీల్లో విశాఖ నేతలకు చోటు



తాటిచెట్లపాలెం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన రెడ్డి ఆదేశాల మేరకు నగరానికి చెందిన పలువురు నాయకులను పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో వివిధ హోదాల్లో నియమించారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర విద్యార్థి విభాగం జాయింట్ సెక్రటరీగా బానాల తరుణ్‌కుమార్ (విశాఖ ఉత్తర), రాష్ట్ర వలంటీర్స్ విభాగం జనరల్ సెక్రటరీగా పులుగం శ్రీనివాసరెడ్డి(విశాఖ తూర్పు), రాష్ట్ర వలంటీర్స్ విభాగం జాయింట్ సెక్రటరీగా బుసి అప్పలనాయుడు (విశాఖ పశ్చిమ), రాష్ట్ర సోషల్ మీడియా విభాగం సెక్రటరీగా గోపిరాజు వంక (విశాఖ పశ్చిమ), రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శులుగా జి.గణేష్‌రెడ్డి (విశాఖ తూర్పు), నమ్మి నాగేశ్వరరావు(విశాఖ ఉత్తర), రాష్ట్ర ఆర్టీఐ విభాగం సెక్రటరీగా సింగారపు సత్యనారాయణ (విశాఖ పశ్చిమ), రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ జాయింట్ సెక్రటరీగా ప్రగడ ప్రసాద్ (గాజువాక) నియమితులయ్యారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా జగన్నాథంరెడ్డి

సీతంపేట: వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా విశాఖ ఉత్తర నియోజకవర్గానికి చెందిన తాడి జగన్నాథంరెడ్డి నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

20 వేల డోసుల రేబిస్ వ్యాక్సిన్ సిద్ధం

ఆరిలోవ: ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.కరుణాకరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కుక్కల పెంపకందారులకు 20 వేల డోసులు రేబిస్ టీకా మందు (వ్యాక్సిన్) ఉచితంగా అందించేందుకు సిద్ధం చేసినట్లు తెలిపారు. జిల్లాలో అన్ని పశు వైద్యశాలల్లో వ్యాక్సిన్ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

ఘనంగా జగన్నాథుని తిరుగు యాత్ర



తిరుగుయాత్రలో పాల్గొన్న భక్తులు

టీచర్స్‌కాలనీ: ఉత్కళ్ సంస్కృతి సమాజ్ ఆధ్వర్యంలో జగన్నాథ స్వామి రథయాత్ర ముగింపు వేడుక శనివారం అత్యంత వైభవంగా జరిగింది. తొమ్మిది రోజుల కిందట లాసన్స్‌బే కాలనీలోని గుండిచా ఆలయానికి వెళ్లిన జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవి తిరిగి దసపల్లాలోని ప్రధాన ఆలయానికి చేరుకున్నారు. భక్తులు భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగారు. ఈ ఊరేగింపులో ఒడిస్సీ, కూచిపూడి నృత్యాలు, ఒడిశా కళాకారుల 'ఢింసా'నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రధాన ఆలయానికి చేరుకున్నాక.. లక్ష్మీదేవిని శాంతిపజేయడానికి జగన్నాథుడు రసగుల్లాలు సమర్పించే సంప్రదాయాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో సుమారు 3 వేల మంది భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు. సమాజ్ అధ్యక్షుడు జె.కె. నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి మోసాలు ఎండగడదాం..

'బాబు ష్యూరిటీ-మోసాలు గ్యారెంటీ' పేరిట చంద్రబాబు మ్యానిఫెస్టోను గుర్తు చేద్దాం

- ఫేక్ రాజకీయాలు చేసేదే చంద్రబాబు
- ప్రజా క్షేత్రంలో తేల్చుకుందాం రా..?
- జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ నేతలు బొత్స సత్యనారాయణ, కురసాల కన్నబాబు, కేకే రాజు



క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న బొత్స, కన్నబాబు, ఎంపీలు గొల్ల బాబూరావు, తనూజారాణి, జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, పార్లమెంట్ పరిశీలకుడు కదిరి బాబూరావు, ఎమ్మెల్సీలు కల్యాణి, రవిబాబు, సమన్వయకర్తలు

సాక్షి, విశాఖపట్నం: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వాన్ని ఎండగడతామని శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు అన్నారు. శనివారం రుషికొండ ఏ1 గ్రాండ్ హోటల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆధ్వర్యంలో పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ముందుగా పార్టీ నేతలంతా మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ.. రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో' క్యూఆర్ స్కాన్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి పార్టీలు ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఏవిధంగా మోసం చేస్తుందో క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి ప్రజలకు వివరించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఫొటోలు, సంతకాలతో కూడిన మ్యానిఫెస్టో, బాండ్‌లను ఎన్నికల ముందు ఇంటింటికీ అందజేశారన్నారు. వాటిని ఇప్పుడు చెత్త బుట్టకే పరిమితం చేశారన్నారు. మ్యానిఫెస్టోలో హామీలు అమలు చేయలేదని ప్రశ్నిస్తే.. నాలుక మందమని చంద్రబాబు, తాటతీస్తానని పవన్‌కల్యాణ్ అంటున్నారని మండిపడ్డారు. సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకుండానే అన్ని ఇచ్చేశానని చంద్రబాబు మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. తమ పార్టీని ఫేక్ అంటున్న ఆయన, హామీలు ఎగ్గొట్టిన కూటమి ప్రభుత్వం పెద్ద ఫేక్, అరాచకాలు చేస్తున్న టీడీపీ ఫేక్ అని అన్నారు. ఇంతకీ ఎవరు ఫేక్ అనేది ప్రజా క్షేత్రంలో తేల్చుకుందాం రా..? అని సవాల్ విసిరారు. ఆగస్టులో ఉచిత బస్సు పథకం అమలు అంటున్నారు. అవి పరిమితులతో కూడినవని లీక్‌లు ఇస్తున్నారన్నారు. ఆడబిడ్డ నిధి, పీ-4 అంటూ కాలయాపన చేస్తున్నారు. ఈ ఏడాదిలో ఏప్రిల్, మే నెలలో అన్నదాత సుఖీభవ అందజేస్తామని శాసనమండలిలో లోకేష్ చెప్పారని.. తండ్రి వంద అబద్ధాలు మాట్లాడితే.. కొడుకు 200 అబద్ధాలు, మోసాలు మాట్లాడుతున్నాడన్నారు.

- భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన అన్నీ హామీలు అమలు చేశాం.. కానీ దురదృష్టవశాత్తు ఓటమి పాలయ్యాం తప్ప ప్రజల మనస్సులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రేమ, అభిమానం పోలేదన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో విశాఖలో కబ్జాలు, మోసాలు, దందాలు మాత్రమే జరుగుతున్నాయని, ప్రజల సంక్షేమం కోసం కనీసం ఆలోచన చేయడం లేదన్నారు.
- ఎమ్మెల్సీ కుంభా రవిబాబు మాట్లాడుతూ కూటమి పార్టీలు ఏ ఒక్క హామీ కూడా పూర్తి స్థాయిలో అమలు చేసిన పాపాన పోలేదన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను, ప్రసంగాలను ఒక్కసారి ప్రజలకు గుర్తుచేయాలన్నే ఉద్దేశంతో క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా మీ ముందుకు తెచ్చామన్నారు. ఈ మోసాలను గ్రామాల్లో, వార్డుల్లో ప్రతీ ఒక్కరికి వివరించాలన్నారు.
- ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ ఎన్‌డీఏ అంటే నేరాలు, అత్యాచారాలు, దాడులుగా మారిందన్నారు. ఏడాది పాలనలో రాష్ట్రంలో రోజుకు సగటున 70 మందిపై మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు జరుగుతున్నట్లు హోంమంత్రే వెల్లడించారన్నారు. ఏడాదిలో ప్రజలకు ఇవ్వాల్సిన రూ.81 వేల కోట్ల సంక్షేమానికి ఎగవేశారన్నారు. కూటమి నేతలు సుపరిపాలనకు తొలి అడుగు అంటున్నారని.. సుపరిపాలనకు ఇది తుంటి అడుగు మాత్రమేనని ఎద్దేవా చేశారు.
- తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు మాట్లాడుతూ ఈ సమావేశం పార్టీ క్యాడర్‌లో ఉత్సాహం నింపిందన్నారు. కూటమి ఏడాది పాలనలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు, కేసులు పెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుచేశారన్నారు. సంక్షేమం, అభివృద్ధి, యువత, నిరుద్యోగుల భవిష్యత్తు అన్ని కాలరాసి.. కూటమి నాయకులు, కార్యకర్తల జేబులు నింపుకుంటున్న పరిస్థితులు ఉన్నాయన్నారు.
- దక్షిణ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ బాబే మోసం.. ఎంతో మందిని తొక్కేసి వెన్నుపోటు పొడిచి ఎలా ఎదిగాడో ప్రజలందరికీ తెలుసన్నారు. దేశ చరిత్రలోనే ఏ రాష్ట్రంలో కూడా ఏడాది కాలంలో ప్రభుత్వంపై ఇంత పెద్ద స్థాయిలో వ్యతిరేకత లేదన్నారు. రానున్న ఎన్నికల్లో సింగిల్‌గా గెలవగలవా పవన్ కల్యాణ్ అని ప్రశ్నించారు. జమిలీ ఎన్నికలు వస్తే నా చాప్టర్ క్లోజ్ అని మోదీ, అమిత్ షా కాళ్ల మీద పడుతున్న పరిస్థితి చంద్రబాబుదన్నారు.
- మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ మాట్లాడుతూ కూటమి ఏడాది పాలనలో ఏమి చేశారని ప్రజల ముందుకు వెళ్తున్నారని ప్రశ్నించారు. మామను వెన్నుపోటు పొడిచి పార్టీ లాక్కున్న నాటి నుంచి నేటి వరకు పొత్తులతోనే పోటీ చేసి చంద్రబాబు అధికారం చేపట్టారన్నారు. మానిఫెస్టోలో హామీలను వంద శాతం అమలుచేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు.
- విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు కదిరి బాబూరావు మాట్లాడుతూ బాబు వస్తే జాబ్ గ్యారెంటీ అన్నారు. నిరుద్యోగులకు భృతి అన్నారు. ఇలా రైతు నుంచి విద్యార్థి వరకు అన్ని వర్గాల వారిని ఈ ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు.
- గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న అడుగు జాడల్లో మనం అడుగు వేసి కూటమి మోసాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.



హాజరైన పార్టీ కార్యకర్తలు

ప్రజల పక్షాన గొంతు వినిపించాలి



ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి మన అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కార్యకర్తలే బలమని కొనియాడారు. ఏడాది కూటమి పాలనలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులు, మహిళలపై అఘాయిత్యాలు తప్ప ఏమి లేదన్నారు. ప్రతిపక్ష పార్టీగా ప్రజల పక్షాన గొంతు వినిపించాలని.. కూటమి వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. ఎన్నికలకు ముందు మ్యానిఫెస్టో పెట్టడం.. తరువాత వెబ్‌సైట్ నుంచి తొలగించడం చంద్రబాబుకు అలవాటని.. అందుకే మనం టెక్నాలజీతో మొబైల్లోనే మ్యానిఫెస్టో చూపిద్దామన్నారు. విశాఖలో ఎకరా 99 పైసలకే కారుచౌకగా ప్రభుత్వ భూములను ధారాదత్తం చేస్తోందని మండిపడ్డారు. చంద్రబాబు తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని భూస్థాపితం చేస్తానని పగటి కలలు కంటున్నాడని, సోనియాగాంధీ వల్లే కాలేదు.. నువ్వేమి చేయగలవన్నారు.

విలువలు, విశ్వసనీయత అంటేనే జగన్



పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు మాట్లాడుతూ గత ఐదేళ్లలో విలువలు, విశ్వసనీయతతో కూడిన రాజకీయాలను పరిచయం చేసిందే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కొనియాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అధికారం చేపట్టిన మరుక్షణం అమలుచేశాన్నారు. కూటమి నేతలు సూపర్ సిక్స్‌తోపాటు 140కి పైగా హామీలు ఇచ్చి గద్దెనెక్కాక వాటిని విస్మరించారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి రీకాలింగ్ బాబుస్ మానిఫెస్టో పేరిట చంద్రబాబు హామీలన్నీ గుర్తు చేయాలన్నారు. గ్రామ స్థాయి, మండల స్థాయి, వార్డుల్లో కూడా సమావేశాలను ఏర్పాటు చేసి ప్రజలకు కూటమి మోసాలు, వైఫల్యాలను వివరిద్దామన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబు



రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు మాట్లాడుతూ పీ4తో పేదరికం పోగొట్టగలరా..? అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రజలను చంద్రబాబు మోసం చేస్తున్నాడన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పారదర్శకంగా పాలన సాగిందన్నారు. 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' పేరిట ప్రతి ఇంటికి వెళ్లి క్యూ ఆర్ కోడ్ ద్వారా రీకాలింగ్ బాబుస్ మానిఫెస్టో పేరిట వివరించాలన్నారు.

కార్యక్రమంలో మాజీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, పసుపులేటి బాలరాజు, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, మాజీ ఎమ్మెల్యేలు అన్నంరెడ్డి అదీప్‌రాజ్, తైనాల విజయకుమార్, చింతలపూడి వెంకటరామయ్య, మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్ కె.సతీష్, పార్టీ కార్యాలయ పర్యవేక్షకుడు రవిరెడ్డి, రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులు బొల్లవరపు జాన్ వెస్లీ, పేర్ల విజయ్ చందర్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, ముఖ్యనేతలు రొంగలి జగన్నాథం, జియ్యాని శ్రీధర్, ఉరుకూటి అప్పారావు, వుడా రవి, ఐహెచ్ ఫరూఖీ, బోని శివరామకృష్ణ, అల్లు శంకర్‌రావు, పిల్లా సుజాత సత్యనారాయణ, పోతిన శ్రీనివాసరావు, పిల్లి సుజాత నూకరాజు, అల్లంపల్లి రాజుబాబు, దాట్ల వెంకట అప్పల ప్రసాద్ రాజు, మహంతి, మంతెన మాధవి వర్మ, పల్లా చిన్నతల్లి, డాక్టర్ జహీర్ అహ్మద్, సతీష్ వర్మ, మంత్రి రాజశేఖర్, నడిపంపల్లి కృష్ణంరాజు, బోని బంగారు నాయుడు, చెన్నా జానకీరామ్, గల్లా శ్రీనివాస్, గంద్రెడ్డి శ్రీనివాస్, మువ్వల సురేష్, ద్రోణంరాజు శ్రీ వాస్తవ, బాకీ శ్యామ్‌కుమార్ రెడ్డి, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు అబంటి శైలేష్, ఉరుకూటి చందు, పేడాడ రమణి కుమారి, బోని అప్పలనాయుడు, సనపల రవీంద్ర భరత్, బర్కత్ అలీ, పులగం కొండా రెడ్డి, మామిడి శివ రామకృష్ణ, సేనాపతి అప్పారావు, పీలా ప్రేమ కిరణ్ జగదీష్, రామి రెడ్డి, చిక్కాల సత్యనారాయణ, అనిల్ కుమార్, కల్పన, దిలీప్ కుమార్, బాజీ నాయుడు, మారుతీ ప్రసాద్, బోండా ఉమామహేశ్వర రావు, వాసుపల్లి యల్లాజీ, జీలకర్ర నాగేంద్ర, దేవరకొండ మార్కేండేయులు, నీలి రవి, శ్రీదేవివర్మ, బయ్యవరపు రాధ, పార్టీ జిల్లా కార్యదర్శులు, రాష్ట్ర అనుబంధ విభాగం ఉపాధ్యక్షులు, రాష్ట్ర అనుబంధ విభాగం జోనల్ అధ్యక్షులు, రాష్ట్ర అనుబంధ విభాగం ప్రధాన కార్యదర్శులు, అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగం అధ్యక్షులు, పార్టీ జిల్లా అధికారి ప్రతినిధులు, మండల, డివిజన్ పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర అనుబంధ విభాగం సభ్యులు, మండల, వార్డు, జిల్లా కమిటీ సభ్యులు, మండల, జిల్లా అనుబంధ విభాగం కమిటీ సభ్యులు, డివిజన్ అనుబంధ విభాగం అధ్యక్షులు, పోలింగ్ బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణ ఏర్పాట్లలోనూ అదే నిర్లక్ష్యం

- తొలిపావంచా వద్ద కూలిన షెడ్
- మారని ఇంజినీరింగ్ అధికారుల తీరు
- తప్పిన పెను ప్రమాదం



కూలిపోయిన షెడ్

సింహాచలం: ఈ నెల 9, 10 తేదీల్లో జరగనున్న గిరి ప్రదక్షిణ ఉత్సవ ఏర్పాట్లలో భాగంగా సింహాచలం కొండదిగువ తొలి పావంచా వద్ద నిర్మిస్తున్న తాత్కాలిక షెడ్ శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు కుప్పకూలింది. ఆ సమయంలో అక్కడ భక్తులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన దేవస్థానం ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యాన్ని మరోసారి బహిర్గతం చేసింది. సింహాచలంలోని కొండ దిగువ తొలిపావంచాకి ఒక విశిష్టత ఉంది. గిరి ప్రదక్షిణ రోజుల్లో ఇక్కడే కొబ్బరికాయ కొట్టి భక్తులు నడక ప్రారంభిస్తారు. 32 కిలోమీటర్లు ప్రదక్షిణ చేసి తిరిగి ఇక్కడే కొబ్బరికాయ కొట్టి ప్రదక్షిణ ముగిస్తారు. ఆ రోజు తొలి పావంచా వద్ద నెలకునే రద్దీ అంతా ఇంతా కాదు. వీరి సౌకర్యార్థం తొలిపావంచా పక్కనే ఉన్న అర ఎకరం విశాల ప్రాంగణంలో దాదాపు 20 క్యూలను ఏర్పాటు చేశారు. భక్తులు ఎండ, వాన నుంచి రక్షణ పొందేందుకు రెండు రోజులుగా ఈ షెడ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఈ పనులను ఇంజినీరింగ్ పర్యవేక్షించకుండా పూర్తిగా కాంట్రాక్టర్‌పైనే వదిలేశారు. పైగా ఈసారి రాష్ట్రంలోని పలు దేవస్థానాల నుంచి 20 మంది వరకు ఇంజినీరింగ్ అధికారులను డిప్యూటేషన్‌పై ఇక్కడకు రప్పించారు. అయితే నిర్మాణ పనుల నాణ్యతను పర్యవేక్షించడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 30న చందనోత్సవం రోజున గోడకూలి ఏడుగురు మరణించిన ఘటన నుంచి కూడా అధికారులు పాఠాలు నేర్చుకోలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా.. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన దేవస్థానం ఈవో వి.త్రినాథరావు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు. రూ.5.80 లక్షల విలువైన ఈ పనులను కేఏస్ఆర్ సప్లయర్స్ అనే కాంట్రాక్టర్‌కు అప్పగించగా, వారు మరో సబ్-కాంట్రాక్టర్‌తో పనులు చేయిస్తున్నట్లు తెలిసింది. క్రేన్ సహాయంతో పనులు చేస్తుండగా షెడ్ కూలిందని ప్రాథమికంగా నిర్ధారించారు. భక్తుల భద్రత దృష్ట్యా, కూలిన షెడ్‌ను పూర్తిగా తొలగించాలని, ఇకపై ఎలాంటి షెడ్లు ఏర్పాటు చేయకుండా కేవలం క్యూలు మాత్రమే కొనసాగించాలని ఈవో ఆదేశించారు. ఉత్సవాల సమయంలో ఇదే ఘటన జరిగి ఉంటే పరిస్థితి దారుణంగా ఉండేదని పలువురు భక్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏడాది పాలన సంతృప్తినిచ్చింది

కలెక్టర్ హరేంధిర ప్రసాద్



మహారాణిపేట: జిల్లా కలెక్టర్‌గా ఏడాది పూర్తి చేసుకోవడం ఎంతో సంతోషాన్ని, సంతృప్తినిచ్చిందని కలెక్టర్ ఎం.ఎన్.హరిందిర ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పర్యాటక, విద్యా, ఐటీ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రైల్వే జోన్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవడం, మెట్రో రైలుకు భూసేకరణ వంటి కీలక పనులు తన హయాంలోనే జరగడం శుభపరిణామమని అన్నారు. ఈ ఏడాది కాలంలో ప్రధానమంత్రి రెండుసార్లు విశాఖను సందర్శించడం, విశాఖ వేదికగా ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుకు శంకుస్థాపన, పలు జాతీయ రహదారుల ప్రారంభోత్సవాలు చేపట్టడం సంతోషించదగ్గ పరిణామాలని పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమం గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకోవడం మరిచిపోలేని అనుభూతినిచ్చిందని కలెక్టర్ గుర్తుచేసుకున్నారు. మరికొద్ది రోజుల్లో డబుల్ డెక్కర్ బస్సులు నగరంలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. నగరంలో పేరున్న హోటళ్ల నిర్మాణం శరవేగంగా సాగుతోందని చెప్పారు. విశాఖ నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టుకు సుమారు 45 నిమిషాల్లోనే చేరుకునే విధంగా రోడ్డు, వంతెనల నిర్మాణాలు వచ్చే జూన్ నాటికి పూర్తయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. షీలానగర్ నుంచి సబ్బవరం వరకు జాతీయ రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. విశాఖ నగరంలో 33 శాతం పైబడి పచ్చదనం ఉండేలా చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వెల్లడించారు.

లోక్ అదాలత్‌లో 10,136 కేసుల పరిష్కారం

కేసుల రాజీలో రాష్ట్రంలో రెండో స్థానం



చెక్కును లబ్ధిదారుకు అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు

విశాఖ లీగల్: హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం నిర్వహించిన మెగా జాతీయ లోక్ అదాలత్‌లో 10,136 కేసులను పరిష్కరించి, ఉమ్మడి విశాఖ జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచిందని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు తెలిపారు. సివిల్ 291, క్రిమినల్‌లో 9713, ప్రీ లిటిగేషన్‌లో 132 కేసులు రాజీ చేశామని వివరించారు. ఉమ్మడి విశాఖలో కేసుల రాజీకి 37 బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. అత్యధికంగా ఒక కేసులో బీమా సంస్థ 80 లక్షలు చెల్లించి రికార్డు నెలకొల్పిందన్నారు. సంస్థ ప్రతినిధులను జిల్లా న్యాయమూర్తి అభినందించారు. జిల్లావ్యాప్తంగా 4,900 కేసులు గుర్తించగా ఇప్పటికే 5,000 కేసులు వరకు రాజీ చేశామని న్యాయమూర్తి తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో కొనసాగిందన్నారు. కేసుల రాజీ వల్ల మొత్తం దాదాపు రూ.25 కోట్ల వరకు ఉంది. న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎంకే శ్రీనివాస్, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

సమన్వయంతో విజయవంతం చేద్దాం

గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించే గిరి ప్రదక్షిణ మహోత్సవాన్ని సమన్వయంతో విజయవంతం చేద్దామని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరి ప్రదక్షిణకు 5-6 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పటిష్టమైన పోలీస్ బందోబస్తు, క్యూలు, రద్దీ ప్రదేశాల్లో తోపులాటలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రతి 200 మీటర్లకు ఒకటి చొప్పున 132 తాగునీటి పాయింట్లు, 500 మరుగుదొడ్లు, ఆరు కంట్రోల్ రూమ్‌లు, ఐదు చోట్ల పబ్లిక్ అడ్రస్ సిస్టం, 13 పార్కింగ్ ప్రాంతాలు, 50 ఉచిత బస్సు సర్వీసులు, 18 నెట్‌వర్కింగ్ ఆసుపత్రులకు అనుసంధానంగా 32 వైద్య శిబిరాలు, 18 అంబులెన్సులు సిద్ధం చేసినట్లు చెప్పారు. రద్దీ ప్రాంతాల్లో 190 ఎల్ఈడీ దీపాలు, నిరంతర విద్యుత్ సరఫరా కోసం 9 జనరేటర్లు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా 9, 10 తేదీల్లో మద్యం దుకాణాలు మూసివేత, అప్పుఘర్ వద్ద 5 బోట్లు, 60 మంది గజ ఈతగాళ్లు అందుబాటులో ఉంటారని కలెక్టర్ వెల్లడించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పక్కా ఏర్పాట్లు చేయాలని ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు సూచించారు.

2 గంటలకు ప్రచార రథం ప్రారంభం

దేవస్థానం ఈవో త్రినాథరావు మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు తొలిపావంచా వద్ద అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతి రాజు ప్రచార రథాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఆ రోజు రాత్రి 10 నుంచి 11 గంటల మధ్యలో రథం ఆలయానికి చేరుకుంటుందని, స్వామి పవళింపు సేవ, ఇతర లాంఛనాల అనంతరం 10వ తేదీ ఉదయం 5 గంటలకు స్వామి దర్శనాలు ప్రారంభమవుతాయని చెప్పారు.

రూ.103 కోట్లతో జైళ్ల అభివృద్ధి

జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాస్



మాట్లాడుతున్న ఐజీ ఇండ్ల శ్రీనివాస్

ఆరిలోవ: రాష్ట్రంలో వివిధ జైళ్లలో రూ.103 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఏపీ జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ పనుల కోసం పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ సిద్ధం చేసిన డిజైన్‌ను అప్రూవల్ కోసం ప్రభుత్వానికి పంపించామని, అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలియజేశారు. విశాఖ కేంద్ర కారాగారాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఇక్కడ జైల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు, డిప్యూటీ సూపరింటెండెంట్లు జవహర్‌బాబు, సాయి ప్రవీణ్, సూర్యకుమార్, జైలర్లతో కలసి పలు బ్యారక్‌లు, ఆస్పత్రులను పరిశీలించారు. ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలు, అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జైళ్ల అభివృద్ధికి కృషి జరుగుతోందన్నారు. విశాఖ కేంద్ర కారాగారంలో రూ.10 కోట్లతో 250 మంది ఖైదీల సామర్థ్యం కలిగిన కొత్త బ్యారక్ నిర్మాణం చేపట్టనున్నామని తెలిపారు.

ఐసీజేఎస్ 2.0తో శాఖల మధ్య సమన్వయం

జైళ్ల శాఖతో పోలీస్, న్యాయ శాఖలను అనుసంధానం చేస్తూ ఇంటిగ్రేటెడ్ క్రిమినల్ జస్టిస్ సిస్టం 2.0(ఐసీజేఎస్) టెక్నాలజీని ఏర్పాటు చేశామని, దీని వల్ల ఆ మూడు శాఖల మధ్య సమన్వయం ఏర్పడుతుందని తెలిపారు. ల్యాప్‌టాప్‌లు, డెస్క్‌టాప్‌లు వినియోగించి, ఆన్‌లైన్ విధానం అమలు జరుగుతుందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 14 కేంద్ర కారాగారాల్లో సూపరింటెండెంట్లకు ఒక్కో ల్యాప్‌టాప్ చొప్పున అందించామన్నారు. వీటితో పాటు అన్ని కేంద్ర కారాగారాలు, జిల్లా, సబ్ జైళ్లకు మరో 108 డెస్క్‌టాప్‌లు అందించామని తెలిపారు. దీనివల్ల సాంకేతిక, పరిపాలనా విధానం, సీసీ కెమెరాల పనితీరు, అవి ఏ విధమైన సాంకేతికతతో కూడి ఉన్నాయి, ఖైదీల పూర్తి వివరాలు, బయోమెట్రిక్ విధానం తదితర అంశాలు స్పష్టంగా నమోదై ఉంటాయన్నారు. ఆ వివరాలు అవసరం మేరకు అందుబాటులో ఉంటాయని వివరించారు.



పనిమనిషే దొంగ

- సుజాతనగర్‌లోని ఓ ఇంట్లో 17 తులాల బంగారం, వజ్రాలు మాయం
- చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు
- సొత్తు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న లక్ష్మణరావు


పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

పెందుర్తి: తాను పనిచేస్తున్న ఇంటికే కన్నం వేసి, యజమానులకు దాదాపు రూ. 22 లక్షల విలువైన బంగారు, వజ్రాభరణాలను అపహరించిన ఓ ఘనురాలిని పోలీసులు అరెస్టు చేశారు. మూడేళ్లుగా నమ్మకంగా పనిమనిషిగా ఉంటూ, యజమాని కుటుంబం లేని సమయం చూసి చేతివాటం ప్రదర్శించిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను వెస్ట్ జోన్ క్రైమ్ ఏసీపీ డి. లక్ష్మణరావు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సుజాతనగర్ మెయిన్ రోడ్డు సమీపంలో నివసించే మండపాటి రాఘవేంద్ర, కొత్తవలస మండలం మంగళపాలెంలోని గురుదేవ ఆస్పత్రిలో వైద్యుడిగా పనిచేస్తున్నారు. ఆయన భార్య కూడా ఉద్యోగిని. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం ఇంటి పనుల కోసం వేపగుంట సమీపంలోని వరలక్ష్మీనగర్‌కు చెందిన తనుబుద్ది సత్యవతిని పనిమనిషిగా నియమించుకున్నారు. సత్యవతి నమ్మకంగా ఉండటంతో, రాఘవేంద్ర దంపతులు విధులకు వెళ్లినప్పుడు ఇంటి బాధ్యతలను ఆమెకే అప్పగించేవారు. గత నెల 25న రాఘవేంద్ర దంపతులు విధులకు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చిన తరువాత బీరువా తెరవడానికి ప్రయత్నించగా లోపల వస్తువులన్నీ చిందరవందరగా ఉన్నాయి. దీంతో అనుమానం వచ్చిన రాఘవేంద్ర బీరువాను పరిశీలించగా అందులో ఉన్న సుమారు 206.86 గ్రాముల బంగారం, రూ. 2 లక్షల విలువైన వజ్రాభరణాలు మాయమైనట్లు గుర్తించారు. వెంటనే పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా పనిమనిషి సత్యవతి కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. విచారణలో ఆమె చోరీకి పాల్పడినట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు ప్రశ్నించగా సత్యవతి నేరం ఒప్పుకుందని ఏసీపీ తెలిపారు. చోరీ సొత్తును ఆమె నుంచి స్వాధీనం చేసుకుని నిందితురాలిని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ లక్ష్మణరావు వివరించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన వెస్ట్ జోన్ సీఐ ఎన్. శ్రీనివాసరావు, పెందుర్తి ఎస్ఐ డి. సూరిబాబు, ఏఎస్ఐ కె. శ్రీనివాసరావు, హెచ్‌సీలు జి. నాగరాజు, టి. పద్మజ, పీసీలు ఎల్. సింహాచలం నాయుడు, ఎల్. త్రిమూర్తులు, టి. శివప్రసాద్, బి. దేముడునాయుడు, ఎల్.కె. తాతారావు, ఆర్. సంతోషి, పి. హైమావతి, జి. శ్రీనివాసరావు, వి. విజయ్‌కుమార్, యూ. చంద్రకళలను ఉన్నతాధికారులు అభినందించారు.

వైద్యంలో రోగి పూర్వ చరిత్ర పరిశీలన కీలకం

- నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి
- మధురవాడలో ఐసాకాన్ సౌత్ జోన్ కాన్ఫరెన్స్ ప్రారంభం



నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిని సత్కరిస్తున్న అనస్థీషియా వైద్యులు

మధురవాడ: వైద్య విధానంలో రోగి పూర్వ చరిత్ర పరిశీలన వైద్యులకు ఎంతగానో ఉపయోగపడుతుందని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. ఈ అంశం అనస్తీషియా వైద్యులతో పాటు అన్ని విభాగాల వైద్యులకు ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. మధురవాడలోని విశాఖ వి.కన్వెన్షన్ సెంటర్‌లో ఐసాకాన్ పేరుతో నిర్వహిస్తున్న 40వ ఇండియన్ అనస్తీషియా సౌత్ జోన్ కాన్ఫరెన్స్, 34వ రాష్ట్ర మహా సభలను శనివారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వైద్యంలో అనస్తీషియాకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో వైద్య విధానాల్లో వస్తున్న మార్పులు, నూతన పోకడలు, సాంకేతికతపై వైద్యులతో పాటు పీజీ విద్యార్థులు దృష్టి సారించాలని సీపీ సూచించారు. ఐఎస్ఏ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ బాలవెంకట్, డాక్టర్ బాజువాలు మాట్లాడుతూ.. చికిత్సల సందర్భంగా రోగికి నొప్పి లేకుండా మత్తు ఇవ్వడంతో పాటు తిరిగి యథాస్థితికి తీసుకురావాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సూరిశెట్టి శ్రీనివాసరావు సదస్సు ప్రాధాన్యతను, వైద్య రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పుల గురించి క్షుణ్ణంగా వివరించారు. సదస్సులో భాగంగా పలువురు వైద్యులు, వైద్య విద్యార్థులు ప్రచురించిన పత్రాలను నిపుణులకు సమర్పించారు. యువ వైద్యులకు క్విజ్ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సీపీ బాగ్చికి శాలువాలు కప్పి, జ్ఞాపిక అందజేసి సత్కరించారు. ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్ణాటక, పుదుచ్చేరి, ఒడిశా, మధ్యప్రదేశ్‌కు చెందిన సుమారు 1,300 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ రంగంలో ఉన్న పీజీ విద్యార్థులు, ప్రాక్టీషనర్స్‌కు అవసరమయ్యే వెంటిలేటర్లు, మత్తు యంత్రాలు, ఆపరేషన్లలో ఉపయోగించే పరికరాలు, మొదలైన 36 రకాల స్టాళ్లతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఐఎస్ఏ మాజీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఠాగూర్, డాక్టర్ చక్రరావు, డాక్టర్ కామేశ్వరరావు, డాక్టర్ కుచెల్‌బాబు, డాక్టర్ భీమేశ్వరరావు, ఏపీ మాజీ అధ్యక్షుల, నగర బ్రాంచ్ అధ్యక్షుడు డాక్టర్ కె. పరంజి తదితరులు పాల్గొన్నారు.



ఆవిష్కరణల కేంద్రంగా ఏపీని తీర్చిదిద్దుదాం


సదస్సులో పాల్గొన్న ఎంపీ శ్రీ భరత్ తదితరులు

ఏయూక్యాంపస్: ఆంధ్రప్రదేశ్‌ను ఆవిష్కరణల్లో అగ్రగామిగా తీర్చిదిద్దాలని ఎంపీ ఎం.శ్రీ భరత్ పిలుపునిచ్చారు. శనివారం బీచ్‌రోడ్డులోని ఒక హోటల్‌లో జరిగిన ఇన్ఫినిటీ విశాఖపట్నం 2025 సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సదస్సులో భారతీయ విద్యా విధానం, పర్యవేక్షణ, ఆవిష్కరణ అనే కీలక అంశాలపై నిపుణులు చర్చించారు. పరిశ్రమలు, విద్యా వ్యవస్థలు సమన్వయంతో పని చేయడం ద్వారా రాష్ట్రాన్ని ఐటీ, ఐటీ ఆధారిత రంగాల్లో అగ్రగామిగా నిలపడంపై నిపుణులు తమ విలువైన సూచనలు అందించారు. సదస్సులో భాగంగా ఆవిష్కరణలు, భవిష్యత్తుకు అవసరమైన సాంకేతికతలు, డెమో జోన్స్, స్టార్టప్ పిచెస్, విద్యార్థుల ఆవిష్కరణలను ప్రదర్శించారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి అత్యాధునిక రంగాలపై చర్చలు జరిగాయి. మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్, కేపీఎంజీ, క్లౌడ్ 4సీ, పాత్ర ఇండియా వంటి సంస్థల నిపుణులు తమ ప్రత్యక్ష ఉదాహరణలు, నైపుణ్యాలను పంచుకున్నారు. ఐటీఏఏపీ అధ్యక్షురాలు లక్ష్మీ ముక్కవిల్లి, జీఐఐ ఏపీ అధ్యక్షుడు జి.మురళీకృష్ణ, ఎస్‌టీపీఐ అదనపు డైరెక్టర్ డాక్టర్ సురేష్, ఎఫ్ట్రానిక్స్ సీఈవో రామకృష్ణ దాసరి పాల్గొన్నారు.

సమ్మోహన భరితం.. సత్యభామ నృత్యోత్సవం



మద్దిలపాలెం: మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో 11వ సత్యభామ యువ నృత్యోత్సవం అట్టహాసంగా ప్రారంభమైంది. తొలి రోజు అంతర్జాతీయ స్థాయి భారతీయ శాస్త్రీయ నృత్య కళాకారుల అద్భుత ప్రదర్శనలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఈ ప్రతిష్టాత్మక నృత్యోత్సవంలో భాగంగా సత్యభామ నేషనల్ అవార్డులు – 2025లను గీతా నారాయణ సుదగాని – కూచిపూడి (ఏపీ), సంజనా పుట్ట – కూచిపూడి (అమెరికా), డా. మనీషా మిట్టల్ – భరతనాట్యం (కర్ణాటక), అపర్ణ శర్మ ఈ.జీ – కేరళ నాటనం (కేరళ), లక్ష్మీశ్రవణ్ – భరతనాట్యం (కర్ణాటక)లకు ప్రదానం చేశారు. వివిధ రాష్ట్రాలకు చెందిన నృత్యోత్సవ డైరెక్టర్లు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సెంట్రల్ జీఎస్టీ అదనపు కమిషనర్ మహమ్మద్ అలీ మాట్లాడుతూ, ఈ ఉత్సవం భారతీయ శాస్త్రీయ నృత్యాలకు గొప్ప వేదికగా నిలుస్తుందని, కళాకారులకు తమ నృత్యాన్ని ప్రపంచానికి చూపించే అవకాశం కలుగుతుందని అన్నారు. రిటైర్డ్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ రవిశంకర్ నారాయణ్ సుధాగాని, రైటర్స్ అకాడమీ అధ్యక్షుడు వి.వి. రమణమూర్తి పాల్గొన్నారు.

జాతీయ నృత్య పోటీలు : నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకులు, నృత్యోత్సవాల సారథి బత్తిన విక్రమ్ గౌడ్ మాట్లాడుతూ తొలిరోజు జరిగిన జాతీయ నృత్య పోటీలలో సుమారు వందకు పైగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు పాల్గొన్నారని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన భరతనాట్యం, కథాకళి నృత్య కళాకారిణి పరిమిత ముఖర్జీ, మణిపూరి రాష్ట్రానికి చెందిన సుమనలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. భరతనాట్యం, కూచిపూడి, మణిపూరి, ఒడిస్సీ వంటి భారతీయ శాస్త్రీయ నృత్యాలతో పాటు జానపద నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

10 నుంచి సీజీఆర్‌ఎఫ్ సదస్సులు

మహారాణిపేట: ఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, పార్వతీపురం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, ఏలూరు సర్కిళ్ల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10 నుంచి సదస్సులు నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్) చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ పేర్కొన్నారు. ఇందులో భాగంగా 10న శ్రీకాకుళం సర్కిల్ టెక్కలి సెక్షన్, పాలకొండ డివిజన్ వీరఘట్టం సెక్షన్, 17న విశాఖపట్నం జోన్–3 డివిజన్ పద్మనాభం సెక్షన్, 24న రాజమహేంద్రవరం రూరల్ డివిజన్‌లోని కడియం సెక్షన్, 27న జంగారెడ్డిగూడెం డివిజన్ లోని జీలుగుమిల్లి సెక్షన్ కార్యాలయాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే సదస్సులు జరుగుతాయని తెలిపారు.



వారసత్వం, సమర్థత కలిగిన నేత మాధవ్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి ఎంపీలు, ఎమ్మెల్యేల అభినందనలు


పీవీఎన్ మాధవ్‌ను సత్కరిస్తున్న ఎంపీ భరత్, సీఎం రమేష్ తదితరులు

సీతంపేట: పి.వి.చలపతిరావు వారసుడిగా రాజకీయ ప్రవేశం చేసి, స్వయంకృషితో అంచెలంచెలుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎదిగిన పీవీఎన్ మాధవ్‌ను పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు అభినందించారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు అధ్యక్షతన శనివారం పోర్టు కళావాణి స్టేడియంలో ఆత్మీయ అభినందన సభ జరిగింది. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ శ్రీ భరత్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యేలు గణబాబు, పంచకర్ల రమేష్‌బాబు, పి.విష్ణుకుమార్ రాజు, బండారు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు దాడి వీరభద్రరావు, పీలా గోవింద్, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్, మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, సత్యారావు తదితరులు మాధవ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మాధవ్ ఎంత ఎదిగినా ఒదిగి ఉండే మనస్తత్వం కలిగిన నాయకుడని ప్రశంసించారు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి స్థాయికి ఎదగడం గొప్ప విషయమన్నారు. మాధవ్ తండ్రి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారని, ఆ తర్వాత విశాఖ నుంచి కంభంపాటి హరిబాబు రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారని గుర్తు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సంకల్పంతో స్వర్ణాంధ్ర సాధిద్దాం

ప్రజా ప్రతినిధులతో జరిగిన సమీక్షలో కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్. చిత్రంలో పలువురు ప్రజా ప్రతినిధులు

మహారాణిపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీ-4 విధానం అమలు, ఆచరణలో అందరూ కలిసి రావాలని, సంపూర్ణ సహకారం అందించటం ద్వారా స్వర్ణాంధ్ర సాధనలో భాగస్వామ్యం కావాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. స్వర్ణాంధ్ర–2047, జిల్లా, నియోజకవర్గ స్థాయి ప్రణాళికపై శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్ రాజు, పంచకర్ల రమేష్ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర–2047 విజన్‌లో భాగంగా పీ–4 విధానం అమలవుతుందని తెలిపారు. సమాజంలో దిగువ స్థాయిలో ఉన్న 20 శాతం మంది ప్రజలను పైకి తీసుకొచ్చేందుకు ఉన్నత స్థాయిలో ఉన్న ప్రజలు ముందుకు రావాల్సి ఉందన్నారు. కార్యక్రమ పర్యవేక్షణకు ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన జిల్లా స్థాయిలో కమిటీ ఉంటుందన్నారు. పీ–4 విధానం అమల్లో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు 73 వేల బంగారు కుటుంబాలను గుర్తించామని, వాటిని మార్గదర్శకులకు అనుసంధానం చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా పేద ప్రజలకు ముందుగా ప్రభుత్వ యంత్రాంగం నుంచి అందాల్సిన సాయాన్ని అందించాలని, తర్వాత మిగిలిన వర్గాల నుంచి సాయం తీసుకోవాలని ప్రజా ప్రతినిధులు సూచించారు. స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామికవేత్తలు, సమాజంలో ఆర్థికంగా స్థిరపడిన వారి నుంచి సహాయం తీసుకుని పీ–4 విధానాన్ని పక్కాగా అమలు చేద్దామని, స్వర్ణాంధ్ర కలల సాకారాన్ని నిజం చేద్దామని ప్రజా ప్రతినిధులంతా పేర్కొన్నారు. అనంతరం అధికారులు, సామాజిక వేత్తల నుంచి సలహాలు, అభిప్రాయాలు సేకరించారు. వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, పారిశ్రామికవేత్తలు, సీఐఐ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం


చీరను ప్రదర్శిస్తున్న యువతి

తాటిచెట్లపాలెం: వివాహ, పండగల సీజన్ సందర్భంగా నగర వాసులకు విభిన్న వస్త్రాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు నేషనల్ స్కిల్ ఎక్స్‌పో నిర్వాహకులు తెలిపారు. వాల్తేర్ మెయిన్‌రోడ్డులోని గ్రీన్ పార్క్ హోటల్‌లో శనివారం నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభమైంది. మహారాష్ట్ర, కర్నాటక, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్‌కు చెందిన ప్రసిద్ధ పైథాని సిల్క్, సాఫ్ట్ సిల్క్, కాశిదా సిల్క్ చీరలు, చందేరి, మహేశ్వరి, బలుచారి, జామ్దాని, థగ్గిల్, తక్షై మస్లిన్ సిల్క్ వస్త్రాలు, లెనిన్ తదితర చీరలన్నీ ఒకే చోట అందుబాటులో ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 9వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఎగ్జిబిషన్ కం సేల్ అందుబాటులో ఉంటుందన్నారు. ప్రవేశం ఉచితమని, అన్ని డెబిట్, క్రెడిట్ కార్డులను చెల్లింపులకు అంగీకరిస్తామన్నారు.